సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం । 7 । మే । 2025



హైవే.. ఆరు వరుసలు
హైదరాబాద్–విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారి త్వరలోనే ఆరు వరుసలుగా మారనుంది. - 8లో



శిథిలావస్థలో..
మోత్కూరు మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. - 9లో

గరిష్టం/కనిష్టం
40° /27°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆత్మకూరు(ఎం): భూభారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి కోరారు. మంగళవారం ఆత్మకూరు మండలంలోని రాఘవాపురం, రహీంఖాన్‌పేటలో ఆర్డీఓ కృష్ణారెడ్డితో కలిసి నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. సందర్భంగా రాఘవాపురంలో నాలుగు, రహీంఖాన్‌పేటలో 31 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. సమావేశంలో ఆత్మకూరు(ఎం) తహసీల్దార్ లావణ్య, వలిగొండ తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, డీటీ ఎండీ షఫీయొద్దీన్, ఆర్‌ఐలు మల్లిఖార్జునరావు, పాండు, సర్వేయర్ స్వప్న, సిబ్బంది నవనీత, సంజయ్, వనం రమేష్ పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలి



మాట్లాడుతున్న జెడ్పీసీఈఓ శోభారాణి

వలిగొండ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి శోభారాణి అన్నారు. మంగళవారం వలిగొండ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి మండల స్థాయి అధికారులు, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మండలంలోని నాతాళ్లగూడెంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. అనంతరం అదే గ్రామంలోని నర్సరీ, రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీ పరిశీలించారు. అక్కంపల్లిలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఆమె వెంట ఎంపీడీఓ జితేందర్ రెడ్డి, ఏపీఎం జాని, ఎంపీఓ కేదారేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయం సిబ్బంది తదితరులున్నారు.

విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న భీంసింగ్

సంస్థాన్ నారాయణపురం: వేసవి తరగతులకు హాజరై చదువులో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంటర్మీడియట్ ప్రత్యేక అధికారి భీంసింగ్ అన్నారు. సంస్థాన్ నారాయణపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న వేసవి ప్రత్యేక తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. దూర ప్రాంతం విద్యార్థులకు బస్సు, హాస్టల్ సౌకర్యం కల్పించేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ మాతేశ్వరి, అధ్యాపకులు ముత్యాలు, జనార్దన్, రమేష్, నర్సింహ, లక్ష్మీనర్సింహ, మాధవి, శారద, మహేశ్వరి, జావేద్ తదితరులున్నారు.

లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలి

భువనగిరిటౌన్ : రాజీవ్ యువ వికాసం పథకం అమలులో భాగంగా లబ్ధిదారుల ఎంపిక, బ్యాంకు లింకేజ్ ప్రక్రియలను సమీక్షించేందుకు వివిధ మండలాల్లోని బ్యాంక్ మేనేజర్లతో మంగళవారం భువనగిరిలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పథకం జిల్లా సమన్వయకర్త నాగిరెడ్డి పథకం మార్గదర్శకాలను వివరించారు. మే 10 నాటికి తాత్కాలిక లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జినుకల శ్యామ్ సుందర్ మాట్లాడుతూ.. బ్యాంకులకు పంపిన జాబితాలను పరిశీలన చేసి, దినసరి పరిశీలన పురోగతిని ఎంపీడీఓల ద్వారా ప్రధాన కార్యాలయానికి అందించాలన్నారు. సమావేశంలో భువనగిరి, బీబీనగర్, బొమ్మలరామారం, పోచంపల్లి, తుర్కపల్లి, ఆలేరు, మోటకొండూర్, రాజపేట, యాదగిరిగుట్ట మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, బీసీ, మైనారిటీ సంక్షేమ జిల్లా అధికారి యాదయ్య పాల్గొన్నారు.

చెత్త సమస్య.. జనం అవస్థ

గుట్టలో ప్రారంభానికి నోచని డంపింగ్ యార్డు

- పట్టణ శివారుకు చెత్త తరలింపు, కాల్చివేత
- దుర్వాసన, పొగతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- కాళేశ్వరం కాలువలోకి చేరుతున్న వ్యర్థాలు



కాళేశ్వరం కాలువ పక్కనే చెత్త దహనం

యాదగిరిగుట్ట : మున్సిపాలిటీని డంపింగ్ యార్డు సమస్య పట్టి పీడిస్తోంది.పట్టణ శివారులో రెండు ఎకరాల విస్తీర్ణంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసినా స్థలం వివాదం కారణంగా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో రోజూ సేకరిస్తున్న చెత్తను యాదగిరిగుట్ట శివారులోకి తరలించి దహనం చేస్తున్నారు. దుర్వాసన, పొగతో పరిసర ప్రాంత ప్రజలు, దారిన వెళ్లే వారు అవస్థలు పడుతున్నారు.

రోజూ ఏటు టన్నుల చెత్త వ్యర్థాల ఉత్పత్తి

యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో 5,003 నివాస గృహాలు, 50కి పైగా హోటళ్లు, 120 వరకు దుకాణాలు ఉన్నాయి. 21వేల జనాభా ఉండగా యాదగిరి క్షేత్రానికి రోజూ ఐదు వేల మంది భక్తులు వస్తుంటారు. రోజుకు ఏడు టన్నుల చెత్త వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. శని, ఆదివారం, సెలవు రోజుల్లో మరొక టన్ను వ్యర్థాలు అదనంగా ఉత్పత్తి అవుతాయి. పారిశుద్ధ్య నిర్వహణకు 47 మంది కార్మికులు ఉన్నారు. సేకరించిన చెత్తను 8 ఆటోలు, ఒక ట్రాక్టర్ ద్వారా ఏరోజుకారోజు యాదగిరిగుట్ట నుంచి మల్లాపురం వెళ్లే మార్గంలో ఓ చోట డంప్ చేసి కాల్చివేస్తున్నారు.

గోదావరి జలాలు కలుషితం

మల్లాపురం మార్గంలో తరలించిన చెత్తను కాల్చడం ద్వారా పొగ వ్యాపించి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా పక్కనుంచి వెళ్తున్న కాళేశ్వరం కాలువలోకి చెత్త చేరుతుంది. దీంతో యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి గండిచెరువులోకి వెళ్లే గోదావరి జలాలు కలుషితం అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

డంపింగ్ యార్డు సమస్యకు కారణాలివీ..

మున్సిపాలిటీలో సేకరించిన చెత్త, వ్యర్థాలను తరలించేందుకు పట్టణ శివారులో రెండు ఎకరాల్లో స్వచ్ఛత పార్క్ పేరుతో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. తడి, పొడి చెత్తను వేరు చేసి రీసైక్లింగ్ చేయడానికి డంపింగ్ యార్డులో కోటి రూపాయల వ్యయంతో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ యంత్రాలను బిగించింది. ఈ పనులు ఏడాదిన్నర క్రితమే పూర్తయ్యాయి. ముఖ్యంగా పేపర్ అట్టలు, ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి పరిశ్రమలకు విక్రయించి అదనపు ఆదాయం సమకూర్చుకోవాలన్నది మున్సిపాలిటీ ప్రధాన ఉద్దేశం. ఇదిలా ఉండగా డంపింగ్ యార్డు ఏర్పాటు చేసిన స్థలం తమదంటూ ఓ మహిళా కోర్టుకు వెళ్లింది. దీంతో ఏడాది క్రితం ప్రారంభం కావాల్సిన ప్లాంట్ పెండింగ్ పడింది. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ సేకరించిన చెత్తను ఖాళీ స్థలంలో డంప్ చేసి కాల్చివేస్తున్నారు.



మల్లాపురం సమీపంలో ఏర్పాటు చేసిన వ్యర్థాలను వేరు చేసే ప్లాంట్

కేసు కోర్టులో ఉంది



“మల్లాపురం సమీపంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశాం. చెత్త, ఇతర వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడానికి యంత్రాలను సైతం బిగించాం. డంపింగ్ యార్డు భూమి తమదని ఓ మహిళ కోర్టులో కేసు వేసింది. త్వరలోనే కేసు పరిష్కారం అవుతుందని అనుకుంటున్నాం. ఆ వెంటనే ప్లాంట్‌ను ప్రారంభిస్తాం. పట్టణ శివారులోకి తరించిన చెత్తను కాల్చకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం.

–అజయ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, యాదగిరిగుట్ట

మెరికల్లాంటి కార్యకర్తలకే ప్రాధాన్యం

- స్థానిక సమరంలో గెలుపే లక్ష్యం
- ఈసారి కమిటీల్లో మహిళలకు చోటు
- ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

ఆలేరు: మెరికల్లాంటి కార్యకర్తలు, నాయకులకే గ్రామ, మండల, బ్లాక్‌స్థాయి పార్టీ పగ్గాల అప్పగింతలో అధిక ప్రాధాన్యం ఉంటుందని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య స్పష్టం చేశారు. మంగళవారం ఆలేరు పట్టణంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం లేక పదేళ్లు ఎంత గోస పడ్డామో మీకు తెలుసని,.. ఇప్పుడు అధికారంలోకి వచ్చామనే ధీమాతో ఉన్నా.. ఉదాసీనత ధోరణి వీడాలని సూచించారు. అధికారంలోకి రావడం ఎంత ముఖ్యమో..వచ్చిన అధికారాన్ని నిలబెట్టుకోవడం అంతకన్నా ముఖ్యమనే విషయాన్ని విస్మరించొద్దన్నారు. పార్టీ పదవులు అలంకారప్రాయం కాకూడదని.. నిత్యం ప్రజలతో మమేకమవ్వాలన్నారు. సైనికుల్లా పనిచేసే వారికే పార్టీ పదవులు వస్తాయన్నారు. ప్రతి కార్యకర్త, నాయకుడూ మరింత బాధ్యతగా గ్రామాలు, మండల స్థాయిలో పర్యటిస్తూ రాష్ట్ర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. పార్టీ పదవుల విషయంలో ఎవరూ పోటీ పడొద్దన్నారు. ఎవరేం చేస్తున్నారో హైకమాండ్ గమనిస్తోందన్నారు. సంస్థాగత ఎన్నికల్లో పదవులను తాను నిర్ణయించనని.. కార్యకర్తలు, నాయకుల అభీష్టమే ఫైనల్ అని చెప్పారు. ఈసారి కమిటీల్లో మహిళలకు అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ పని చేయాలన్నారు. పార్టీ కోసం పని చేసే వారికి పదవులతోపాటు తనవంతు ఆర్థిక సాయం అందించడానికి ముందుంటానని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ పరిశీలకుడు ధన్వంతరి, జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవ రెడ్డి, ఇన్‌చార్జి అనిల్, మదర్‌డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ, నాయకులు ఎంఎస్ విజయకుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎంఏ.ఇజాజ్, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు పద్ధతులు భేష్



ఆలేరులోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని పరిశీలిస్తున్న తమిళనాడు సీనియర్ ఐఏఎస్ అధికారి షణ్ముఖసుందరం, బృందం సభ్యులు

- తమిళనాడు సీనియర్ ఐఏఎస్ అధికారి షణ్ముఖ సుందరం

ఆలేరు: రాష్ట్రంలో ధాన్యం కొనుగోలుకు అవలంబిస్తున్న పద్ధతులు భేష్ అని తమిళనాడు సీనియర్ ఐఏఎస్ అధికారి షణ్ముఖ సుందరం ప్రశంసించారు. మంగళవారం ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన నేతృత్వంలోని ఐదుగురు అధికారుల బృందం సందర్శించారు. ఈ సందర్భంగా వరి సాగు నుంచి దిగుబడి తరువాత, కేంద్రాలకు తరలించి రైతులు పంటను విక్రయించే వరకు జరుగుతున్న ప్రక్రియను పరిశీలించారు. కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలింపు, ఓపీఎంఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్‌లో రైతుల బ్యాంకుల ఖాతాల్లో డబ్బుల చెల్లింపు విధానాన్ని వ్యవసాయ, మార్కెట్ కమిటీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. దాదాపు 20రోజుల్లో 10633 క్వింటాళ్ల(26వేల బస్తాల) 233మంది రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించడంపై తమిళనాడు బృందం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. అదేవిధంగా తేమ శాతం, తుది నాణ్యత విశ్లేషణ, ధాన్యం మిల్లులకు తరలించిన ట్రక్కుల వివరాలతో కూడిన రిజిస్టర్లు, వాటి నిర్వహణ పద్ధతులు తెలుసుకున్నారు. ఓపీఎంఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఎన్ని దశల్లో రైతుల వివరాలను సేకరించి, నమోదు చేస్తున్నారో తెలుసుకున్నారు. రైతు ఊరు, ఆధార్ నంబర్, ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఎంత దిగుబడి వచ్చింది, నాణ్యతా ప్రమాణాలు ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేస్తున్నారో ఆలేరు వ్యవసాయ, మార్కెట్ కమిటీ అధికారులు తమిళనాడు బృందానికి వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించడం పట్ల అధికారుల బృందం ప్రశంసించింది. అనంతరం వారిని సన్మానించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్‌రెడ్డి, డీసీఎస్ఓ రోజా, డీఎంఓ హరికృష్ణ, మార్కెట్ కమిటీ కార్యదర్శి పద్మ, ఎఫ్‌పీఓ చైర్మన్ స్వామి, ఏఈఓ శివకుమార్, సూపర్‌వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జమకాని వంట గ్యాస్ రాయితీ

- ఐదు నెలలుగా ఎదురుచూస్తున్న మహాలక్ష్మి పథకం లబ్ధిదారులు



ఆలేరురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రవేశ పెట్టింది. జిల్లా మొత్తం 2,49,568 గ్యాస్ కనెక్షన్‌లు ఉండగా 1,25,762 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. ప్రస్తుతం సిలిండర్‌ను రూ.875 విక్రయిస్తున్నాయి. దీనికి కేంద్ర ప్రభుత్వం రూ.47 రాయితీగా ప్రతి వినియోగదారుడి ఖాతాలో జమచేస్తుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వ పథకంలో భాగంగా రూ.500కే సిలిండర్ ఇవ్వాలంటే ఒక్కో సిలిండర్‌కు రూ.328 ఆయా లబ్ధిదారుడి ఖాతాలో జమకావాలి. కానీ ఐదు నెలలుగా జమ కావడం లేదు.

జిల్లాలో గ్యాస్ కనెక్షన్ల వివరాలు

జిల్లాలో దీపం గ్యాస్ కనెక్షన్లు 51,391 ఉండగా, ఉజ్వల్ కనక్షన్లు 13,997 ఉన్నాయి. డొమెస్టిక్ కనెక్షన్లు 1,85,979 ఉండగా, మొత్తం 2,49,568 కనెక్షన్లు ఉన్నాయి. 14 కిలోల సిలిండర్ ధర రూ.875 ఉండగా.. అందులో కేంద్రం రూ.47 రాయితీని 13 సిలిండర్ల వరకు వర్తింపజేస్తుంది. ఇదే మాదిరి రాష్ట్ర ప్రభుత్వం కూడా రూ.500 గ్యాస్ సిలిండర్ పథకానికి పరిమితులు ఏమైనా విధించిందా అనే ప్రశ్న లబ్ధిదారుల్లో తలెత్తుతోంది. జిల్లా అధికారులకు సైతం దీనిపై అవగాహన లేకపోవడంతో రాయితీ ఎందుకు జమకావడం లేదో సమాధానం ఉండడం లేదు.

సబ్సిడీ డబ్బులు పడట్లే..



ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో దరఖాస్తు చేసుకున్నా. ఐదు నెలల నుంచి వంట గ్యాస్ రాయితీ డబ్బులు బ్యాంక్ ఖాతాలో జమకావడం లేదు. అధికారులను అడిగితే మాకు తెలియదని సమాధానం చెబుతున్నారు.

– గుండు లలిత, ఆలేరు

అర్హులకు అందేలా చూస్తాం

మహాలక్ష్మి పథకం కింద అర్హులైన వారిని ఎంపిక చేసి సబ్సిడీ అందిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 5,56,172 సిలిండర్లు సరఫరా చేశాం. మొత్తం రూ.17 కోట్లు లబ్ధిదారులకు రాయితీ కింద అందజేశాం. అర్హులందరికీ సబ్సిడీ అందేలా చూస్తాం.

– రోజా, జిల్లా పౌర సరఫరాల శాఖ ఇన్‌చార్జి అధికారిణి

సంక్షేమాధికారుల సంఘం రాష్ట్ర కోశాధికారిగా లక్ష్మణ్



భైరబోయిన లక్ష్మణ్

రామన్నపేట: వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం రాష్ట్ర కోశాధికారిగా రామన్నపేటకు చెందిన భైరబోయిన లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లోని టీఎన్‌జీఓ సెంట్రల్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన వసతి గృహ సంక్షేమాధికారుల యూనియన్ సమావేశంలో ఆయనను కోశాధికారిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. యూనియన్ పక్షాన సంక్షేమ వసతిగృహ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

అధిక కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జయరాజు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు

భువనగిరిటౌన్ : జిల్లా వ్యాప్తంగా జూన్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా కోర్టులోని ఆయన చాంబర్‌లో జాతీయ లోక్ అదాలత్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జిల్లాలోని న్యాయమూర్తులు, సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, పోలీసు యంత్రాంగంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. జూన్ 14న అన్ని కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి దాదాపు 3228 రాజీ పడదగు అన్ని క్రిమినల్ కేసులను గుర్తించినట్లు తెలిపారు. అత్యధిక కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవిలత, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఉషశ్రీ, ఏపీపీఓలు సౌజన్య, పద్మజ, చంద్రశేఖర్, అవినాష్, పోలీస్ అధికారులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్స్, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు వారు దూరం

- భువనగిరిలో అమలు కాని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు హామీ
- ప్రారంభమైన డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ



భువనగిరి: జిల్లా కేంద్రమైన భువనగిరి పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఫీజు చెల్లించలేని పరిస్థితుల్లో చదువులకు దూరం కావల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఎన్నికల సమయంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినా అవి అమలుకు నోచుకోవడం లేదు. దీంతో పేద విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల్లో ఫీజు చెల్లించే పరిస్థితి లేక చదువులకు దూరం కావాల్సి వస్తోంది.

జిల్లాలో రెండే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు

జిల్లాలో కేవలం రెండు మాత్రమే ప్రభుత్వ డిగ్రీ కళాశాలున్నాయి. వీటిలో రామన్నపేట, ఆలేరు ఉన్నాయి. భువనగిరి పట్టణంలో మాత్రం ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం భువనగిరి.. మున్సిపాలిటీ కేంద్రంగా, శాసనసభ నియోజకవర్గ కేంద్రంగా, పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంగా ఉంది. కానీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాత్రం ఏర్పాటు చేయడంలో ఏ ఒక్క ప్రజాప్రతినిధి ప్రయత్నం చేయడం లేదు. గత ప్రభుత్వ హయాంలో భువనగిరి పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తున్నామని, భవనాలు సైతం చూశారు. 2024 ఎన్నికల్లో అసెంబ్లీ నియోజవర్గం నుంచి పోటీ చేసిన అభ్యర్థులు సైతం తమను గెలిపిస్తే డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని హామీలు ఇచ్చారు. సంవత్సరం గడుస్తున్నా ఇప్పటికీ ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్న దాఖలాలు కనిపించడం లేదు.

పేద విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

ప్రతి ఏటా 1000 మంది విద్యార్థులు డిగ్రీ కళాశాలల్లో చేరుతున్నారు. జిల్లా కేంద్రంలో ప్రైవేటు డిగ్రీ కళాశాలలు తప్ప ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేదు. ప్రైవేట్‌లో ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు రాక ఫీజు చెల్లించలేని పేద విద్యార్థులు డిగ్రీ చేయలేక ఇబ్బందులు పడుతూ చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కాగా.. డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఈ నెల 3 నుంచి దోస్త్ తొలి దశ రిజిస్ట్రేషన్ ప్రారంభమైంది. ఈ ప్రక్రియ మూడు విడుతల్లో కొనసాగనుంది.ఈ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తికాగానే జూన్ 30 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

పోరాటం కొనసాగిస్తాం



భువనగిరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నాం. ఈ విద్యా సంవత్సరం కూడా పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నాం. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తాం. ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలను అమలు చేయాలి.

– మణికంఠ, ఏబీవీపీ ఉమ్మడి నల్లగొండ జిల్లా విభాగ్ కన్వీనర్

ఫీజు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం శోచనీయం. పేద విద్యార్థులు గత్యంతరం లేక ప్రైవేట్ కళాశాలల్లో ప్రవేశం పొందుతున్నారు. ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. స్కాలర్ షిప్ రాక ఫీజు చెల్లించలేక చాలా మంది చదువులకు దూరం అవుతున్నారు. ఇప్పటికైన స్పందించి భువనగిరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి.

– లావుడియా రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

వర్షం మిగిల్చిన నష్టం

భువనగిరిటౌన్, మోత్కూరు : అకాల వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. సోమవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులు, వడగళ్లతో కూడిన భారీ వర్షం రావడంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు వేసిన ధాన్యం కుప్పలు తడిసి ముద్దయ్యాయి. ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పి ఉంచినప్పటికీ గంట పాటు కురిసిన భారీ వర్షంతో వరి ధాన్యం చుట్టూ నీరు చేరింది. తూకం వేసిన ధాన్యం బస్తాలు సైతం తడిసాయి. ఈదురుగాలులకు మామిడి కాయలు నేలరాలాయి.



చందుపట్ల పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం



తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



మోత్కూరు మండలంలోని బుజిలాపురంలో నేలరాలిన మామిడి కాయలు

క్లుప్తంగా

హనుమంతుడికి ఆకుపూజ


పూజ చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనర సింహస్వామి వారి ఆలయానికి క్షేత్రపాల కుడిగా ఉన్న శ్రీఆంజ నేయస్వామికి అర్చకు లు మంగళవారం ఆకుపూజను విశేషం గా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆల యంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాల తో అభిషేకించారు. అనంతరం తమలపాకుల తో అర్చించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగాయి. శ్రీసు దర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం వెండి జోడు సేవ పూజలు నిర్వహించారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక


కొప్పుల శ్రీజ

నకిరేకల్: జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నకిరేకల్ మండలం మంగ ళపల్లి గ్రామానికి చెందిన కొప్పుల శ్రీజ ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య మం గళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాలిగౌరారం మండలం వల్లాల మోడల్ స్కూల్ ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తిచేసిన శ్రీజ గత నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో శ్రీజ పాల్గొంటుందని తెలిపారు.

రసాయన వ్యర్థాల శాంపిల్స్ సేకరణ


శాంపిల్స్ సేకరిస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు

చివ్వెంల(సూర్యాపేట): లారీల్లో రసాయనిక వ్యర్థాలు తీసుకొచ్చి సోమవారం రాత్రి చివ్వెం ల మండలం అక్కలదేవిగూడెం గ్రామ శివారు లో సూర్యాపేట–ఖమ్మం రహదారి పక్కన రహదారి పక్కన వదిలిపెట్టారు. మంగళవారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు రోడ్డు పక్కన పారబోసిన రసాయనిక వ్యర్థాల శ్యాం పిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించారు. వ్యర్థా లు వదిలిన లారీలను స్థానికుల ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి విస్తరణకు గ్రీన్‌సిగ్నల్

- స్వయంగా ప్రకటించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ
- రూ.10వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు నిర్ణయం
- విస్తరణ పూర్తయితే ప్రయాణం సులువు
- బ్లాక్‌స్పాట్‌ల వద్ద అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు

హైవే.. ఆరు వరుసలు


హైదరాబాద్–విజయవాడ హైవేపై చౌటుప్పల్ మండలంలోని ధర్మోజిగూడెం జంక్షన్

చౌటుప్పల్: హైదరాబాద్–విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారి త్వరలోనే ఆరు వరుసలుగా మారనుంది. రూ.10వేల కోట్లతో ఈ హైవేను ఆరు వరుసలుగా విస్తరిస్తామని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్వయంగా ప్రకటించారు. ఇప్పటికే హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ నుంచి చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారులోని ఆంథోల్ మైసమ్మ దేవాలయం వరకు ఆరు వరుసల రహదారి విస్తరణతో పాటు సర్వీస్ రోడ్డు విస్తరణ పనులు సైతం ముమ్మరంగా సాగుతున్నాయి. ఇక అక్కడి నుంచి ఏపీలోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా నందిగామ శివారు వరకు 181 కిలోమీటర్ల మేర ఆరు వరుసలుగా విస్తరించాల్సి ఉంది. రాష్ట్ర విభజన సమయంలోనే రెండు తెలుగు రాష్ట్రాలు ఈ హైవేను ఆరు వరుసలుగా విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. అయితే రకరకాల కారణాలతో ఇప్పటివరకు ఈ ప్రక్రియ కొలిక్కి రాలేదు. ప్రస్తుతం అన్ని అడ్డంకులు తొలగిపోవడంతో హైవే విస్తరణ ప్రక్రియ పట్టాలెక్కింది.

నాలుగు వరుసల కోసం ఎన్నో పోరాటాలు

హైదరాబాద్–విజయవాడ హైవే రెండు వరుసలుగా ఉన్న సమయంలో రోడ్డు ప్రమాదాలు విపరీతంగా జరుగుతుండడంతో ఈ మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించాలని ప్రజలు అనేక పోరాటాలు చేశారు. ఆ తర్వాత దీనిని నాలుగు వరుసలుగా విస్తరించినప్పటికీ ప్రమాదాల సంఖ్య తగ్గడంలేదు. 2011 నుంచి వందలాది మంది తమ ప్రాణాలను కోల్పోయారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఈ హైవే గుండా వాహనాలు రాకపోకల సంఖ్య పెరగడంతో రద్దీగా మారింది. ఆ రద్దీకి అనుగుణంగా నాలుగు వరుసలు ఏమాత్రం సరిపోవడంలేదు. దీంతో ఆరు వరుసలుగా విస్తరించాలని గత కొన్నేళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కేంద్రాన్ని కోరుతూనే ఉన్నాయి. అయితే గతంలో ఈ హైవేను నాలుగు వరసలుగా విస్తరించిన జీఎంఆర్ సంస్థ కోర్టుకు వెళ్లడంతో గతేడాది వరకు ఈ ప్రక్రియ కొలిక్కి రాలేదు. ప్రస్తుతం జీఎంఆర్ సంస్థను ఈ హైవే బాధ్యతల నుంచి తప్పించారు. దీంతో అడ్డంకులు తొలగడంతో విస్తరణ అంశం వేగంగా ముందుకుసాగుతోంది.

ప్రమాదాలను అరికట్టేందుకు ప్రయత్నాలు

ఈ హైవేపై కొన్ని ప్రాంతాల్లోనే తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో.. అసలు ఈ ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి, ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న విషయంలో నిర్వహించిన సర్వేల్లో అనేక కారణాలను గుర్తించారు. ఈ మార్గంలో చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం నుంచి ఏపీలోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా నందిగామ శివారు వరకు 17 బ్లాక్‌స్పాట్‌లు ఉన్నట్లు గుర్తించారు. చౌటుప్పల్, పెద్దకాపర్తి, చిట్యాల, కట్టంగూర్, ఇనుపాముల, టేకుమట్ల, ఎస్వీ కళాశాల–జనగామ ఎక్స్‌రోడ్, ఈనాడు జంక్షన్, దురాజ్‌పల్లి జంక్షన్, ముకుందాపురం, ఆకుపాముల, కొమరబండ ఎక్స్‌రోడ్, కాటమ్మగూడెం, మేళ్లచెరువు, శ్రీరంగాపురం, రామాపురం ఎక్స్‌రోడ్, నవాబ్‌పేట జంక్షన్ బ్లాక్‌స్పాట్‌లుగా ఉన్నాయి. ముందుగా అత్యంత ప్రాధాన్యతా క్రమంలో ఆయా ప్రాంతాలలో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని నిర్ణయించి కేంద్రం నుంచి అనుమతులు, నిధులు సాధించారు. అందులో భాగంగా ప్రస్తుతం ఆయా బ్లాక్‌స్పాట్‌లలోని కొన్ని ప్రాంతాలలో పనులు సైతం ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మరికొన్ని ప్రాంతాలలో త్వరలోనే ప్రారంభంకానున్నాయి.

అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు నిర్మించే బ్లాక్‌స్పాట్‌ల వివరాలు..

గుర్తించిన బ్లాక్ స్పాట్‌లు	అంచనా విలువ (కోట్లలో)
పెద్దకాపర్తి	29.90
చిట్యాల	42.18
నల్లగొండ క్రాస్‌రోడ్డు, కట్టంగూర్	0.26
కొర్లపహాడ్	5.96
ఎస్‌వి.ఇంజనీరింగ్ కాలేజ్,	
జనగామ క్రాస్ రోడ్డు	58.04
ఈనాడు ఎదురుగా	27.97
దురాజ్‌పల్లి	2.80
ముకుందాపురం	13.86
ఆకుపాముల	2.16
కొమరబండ ఎక్స్ రోడ్డు	31.01
కటకమ్మగూడెం	10.89
మేళ్లచెరువు	0.46
శ్రీరంగాపురం	8.50
రామాపురం ఎక్స్‌రోడ్డు	30.26
నవాబుపేట	0.21
మొత్తం	264.84

ఎట్ గ్రేడ్ జంక్షన్ తొలగించే ప్రాంతాల్లో..

చౌటుప్పల్	114.40
టేకుమట్ల	41.42

మరికొన్ని బ్లాక్‌స్పాట్‌లకు విస్తరణలో మోక్షం

ఈ మార్గంలో ఇంకా అనేక బ్లాక్‌స్పాట్‌లు ఉన్నాయి. వాటిని గుర్తించాల్సి ఉంది. గతంలో గుర్తించిన వాటికే ఇప్పుడు ప్రాధాన్యత ఇస్తుండడంతో.. అప్పట్లో గుర్తించని ప్రాంతాలను మరోసారి గుర్తించి కేంద్రానికి నివేదిక అందిస్తే ఆరు లేన్ల విస్తరణ సమయంలో ప్రక్రియ సునాయాసమవుతుందని పలువురు భావిస్తున్నారు. ఇదే విషయమై ఎన్‌హెచ్ఏఐ పీడీ నాగేశ్వర్‌రావును సంప్రదించగా.. ఆరు వరుసల విస్తరణ ప్రక్రియలో వంతెనల నిర్మాణాలకు అవకాశాలు ఉంటాయని తెలిపారు. చాలా రోజులుగా జరిగిన ప్రయత్నాలతో చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామ జంక్షన్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జికి ఆమోదం లభించిందన్నారు.వీలైనంత త్వరలోనే అక్కడ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి అనర్హుడు

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి


మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి అనర్హుడని, రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చి మొసలి కన్నీరు కారుస్తున్నాడని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం సూర్యాపేటలో జగదీష్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలన చేతకాని రేవంత్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంగా ఏర్పడినప్పుడే తెలంగాణ అప్పులతో మొదలైందని, అయినా పదేండ్లు కేసీఆర్ చేసిన అభివృద్ధి పాలన చూడలేదా అని అన్నారు. ఆదాయ వ్యయాల్లో కేసీఆర్‌కు, రేవంత్ కు చాలా వ్యత్యాసం ఉందన్నారు. రేవంత్ మాట్లాడిన ప్రతిమాట అబద్ధమని, రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిని బట్టే కేసీఆర్ హామీలిచ్చారని చెప్పారు. రేవంత్‌రెడ్డి అడ్డగోలు హామీలిచ్చి అమలు చేతకాక ఇప్పుడు చేతులెత్తేసిండని విమర్శించారు. ఇచ్చిన హామీలను గాలికొదిలేసి.. గాలిమోటర్లో తిరిగి.. అప్పులు పుడతలేవంటున్నరని, సీఎం హోదాలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ఆదాయం తగ్గి మంత్రుల ఆదాయం పెరగడంతోనే అసలు సమస్య వస్తుందని చెప్పారు. హామీలు ఎగ్గొట్టడం కోసమే రేవంత్ దొంగ ఏడుపులు ఏడుస్తున్నాడని విమర్శించారు. తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పి రేవంత్ సీఎం పదవికి రాజీనామా చేయాలన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

- ఇద్దరు యువకులు దుర్మరణం


లోకేష్ (ఫైల్)


నిఖిల్ (ఫైల్)

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం మాధారంకలాన్ గ్రామ సమీపంలో 365వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందగా.. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు.. కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్‌ఎల్‌బీసీ కాలనీకి చెందిన మాదగాని లోకేశ్(24), కట్టంగూర్ మండలం మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దోనిబావి గ్రామానికి చెందిన రాచకొండ నిఖిల్(21) స్నేహితులు. లోకేశ్ ఐటీఐ పూర్తిచేసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తయారుచేసే కంపెనీలో అంప్రెంటీస్ చేస్తున్నాడు. నిఖిల్ డిగ్రీ పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. లోకేశ్ మంగళవారం హైదరాబాద్ నుంచి బైక్‌పై పెద్దోనిబావి గ్రామానికి వచ్చి నిఖిల్‌ను పిలుచుకొని నకిరేకల్ మీదుగా 365వ నంబర్ జాతీయ రహదారిపై అర్వపల్లి వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో శాలిగౌరారం మండలం మాధారంకలాన్ గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లోకేశ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌పై వెనుక కూర్చున్న రాచకొండ నిఖిల్‌కు తీవ్రగాయాలు కావడంతో పాటు కారును నడుపుతున్న మండలంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన దేశగాని విఠల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నిఖిల్, విఠల్‌ను నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిఖిల్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని, మృతదేహాలను నకిరేకల్ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

ఈదురుగాలులకు ఒరిగిన ధ్వజ స్తంభం


లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఒరిగిన ధ్వజ స్తంభం (ఇన్‌సెట్‌లో) స్తంభం కింది భాగం

మిర్యాలగూడ: దామరచర్ల మండలం వాడపల్లిలో మంగళవారం భారీ ఈదురుగాలులతో కూడి వర్షం కురవగా.. గ్రామ శివారులోని పురాతన శ్రీలక్ష్మీనృసింహస్వామి, మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు లక్ష్మీనృసింహస్వామి ఆలయ ధ్వజస్తంభం ఒక పక్కకు ఒరిగింది. శివాలయంలోని భారీ చెట్లు నేల కొరిగాయి. ఆలయ పునరుద్ధరణలో భాగంగా 1995లో ఇండియా సిమెంట్స్ కంపెనీ యాజమాన్యం ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్లు కొందూటి సిద్ధయ్య, పాదిల శ్రీనివాస్ తెలిపారు. విశిష్టమైన ఆలయాలు దెబ్బతినడం పట్ల అర్చకులు నాగేంద్రప్రసాద్‌శర్మ, సాంబశివరావుశర్మ, రామానుజాచార్యులు, గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు బోల్తా

- కారుపై విరిగిపడిన విద్యుత్ స్తంభం


బోల్తాపడిన కారు

తిప్పర్తి: అతివేగంగా వస్తున్న కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. అనంతరం ఆ కారుపై విద్యుత్ స్తంభం విరిగి పడింది. ఈ ఘటన తిప్పర్తి మండలం మల్లేపల్లివారిగూడెం వద్ద సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో గుంటూరుకు వెళ్లి సోమవారం రాత్రి తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో తిప్పర్తి మండలం మల్లేపల్లివారిగూడెం వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. కారు ఢీకొన్న వేగానికి విద్యుత్ స్తంభం విరిగి కారుపై పడిపోయింది. అయితే కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు.

విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తికి జైలుశిక్ష

నిడమనూరు: గ్రామ పంచాయతీ కార్యదర్శి విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తికి నిడమనూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి స్వప్న జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. 2018 నవంబర్‌లో తిరుమలగిరి మండలం తునికినూతల గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉబ్బరపల్లి శ్రవణ్ గ్రామసభలో వ్యక్తిగత మరుగుదొడ్ల జాబితా చదువుచుండగా అదే గ్రామానికి చెందిన రమావత్ దేవూనాయక్ లబ్ధిదారుల జాబితాను కార్యదర్శి నుంచి లాక్కోని, అతడి వాహనం తాళం చెవి దుర్భాషలాడాడు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పలువురు సాక్షులను విచారించిన నిడమనూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి దేవూనాయక్‌కు ఒక నెల జైలు శిక్ష, రూ.1000 జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరపున ఎం. సాధన వాదనలు వినిపించారు.

గాయపరిచిన కేసులో..

గాయపరిచిన కేసులో నిందితుడికి జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు నిడమనూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి స్వప్న మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు..పెద్దవూర మండలం కుకుండుచెట్టుతండా వద్ద కంచర్ల శ్రీను ఎలక్ట్రికల్ సర్వీసింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 2016 ఆగస్టులో నిడమనూరు మండలం చెర్వుతండాకు చెందిన రమావత్ హతిరామ్ శ్రీను వద్ద ఫ్యాన్ రిపేరు చేయించుకొని డబ్బులు ఇవ్వకుండా వెళ్తూ ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో హతిరామ్ ఫ్యాన్ తీసుకొని శ్రీనును గాయపర్చాడు. సాక్షులను విచారించిన నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి హతిరామ్‌కు జడ్జి రూ.1000 జరిమానా లేదా నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

రైల్వే వ్యవస్థ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి


నల్లగొండ రైల్వే స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

రామగిరి(నల్లగొండ): రైల్వే వ్యవస్థను ప్రైవేటీకరించే విధానాలను వ్యతిరేకించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. సీఐటీయూ అఖిల భారత కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ జిల్లా నాయకులు మంగళవారం నల గొండ రైల్వే స్టేషన్ ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ దేశంలో రైల్వే వ్యవస్థను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటీకరించడానికి తీవ్ర ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రైల్వే రంగంలో భద్రతా చర్యలు పెంచాలని, ప్రమాదాలు అరికట్టాలని ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. రైల్వే ప్రైవేటీకరణ వల్ల సరుకు రవాణా చార్జీలు పెరగడంతో వస్తువుల రేట్లు పెరుగుతాయన్నారు. ప్రయాణికుల భద్రత కోసం సరైన చర్యలు చేపట్టాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ప్యాసింజర్ రైళ్లు పెంచాలని, రైళ్లల్లో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ, సలివోజు సైదాచారి, గంజి నాగరాజు, పల్లె నగేష్, అవుట రవీందర్, నకరెకంటి సత్తయ్య, లింగస్వామి, వెంకన్న, రాధాకష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఆలేరురూరల్: హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై ఆలేరులో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పట్టణంలోని బృందావనం కాలనీకి చెందిన తపెట్ల శ్రీహర్షిత్, అతడి తమ్ముడు తపెట్ల శ్రీవర్షిత్‌తో పాటు జావిద్ యాక్టీవాపై రామ సముద్రం దగ్గర గల స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు బయల్దేరారు. దర్గా వద్ద వీరు హైదరాబాద్–వరంగల్ హైవే దాటుతుండగా వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు యాక్టీవాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీహర్షిత్ తలకు, శ్రీవర్షిత్‌కు కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. వీరిద్దరిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శ్రీహర్షిత్ ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తిచేయగా.. శ్రీవర్షిత్ 7వ తరగతి చదువుతున్నారు. జావిద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రజనీకర్ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి..

మునగాల: కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కిన గీత కార్మికుడు ప్రమాదవశాత్తు జారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి మునగాల మండలం నారాయణగూడెంలో జరిగింది. వివరాలు.. నారాయణగూడెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కాసాని వెంకటేశ్వర్లు తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా.. మోకు తెగిపోయి చెట్టు పైనుంచి కిందపడ్డాడు. అతడి కుడి కాలు విరగగా, తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వెంకటేశ్వర్లును ఆటోలో కోదాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు మంగళవారం హైదరాబాద్‌కు తరలించారు. వెంకటేశ్వర్లు కుటుంబానికి ప్రభుత్వం, తోడ్పాటునివ్వాలని గ్రామస్తులు కోరతున్నారు.

మద్యం దుకాణంలో రూ.5లక్షల నగదు చోరీ

రామన్నపేట: రామన్నపేట మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ ఎదురుగా గల శ్రీలక్ష్మి వైన్స్‌లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాలకు చెందిన కోనేటి ఎల్లయ్య రామన్నపేటలో శ్రీలక్ష్మి వైన్స్ నిర్వహిస్తున్నాడు. ఆది, సోమవారం మద్యం అమ్మగా వచ్చిన డబ్బులను సోమవారం రాత్రి షాపులోని కౌంటర్‌లో పెట్టి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం పది గంటల సమయంలో షాపు తెరచి చూడగా కౌంటర్‌లోని డబ్బులు కనిపించలేదు. లోపలికి వెళ్లి పరిశీలించగా వెనుక రూం వెంటిలేటర్ పగులగొట్టి ఉంది. సీసీ పుటేజీ పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తి వెంటిలేటర్ నుంచి లోపలికి ప్రవేశించి కాటన్ డబ్బాను ముఖానికి అడ్డుగా పెట్టుకుని కౌంటర్‌లోని డబ్బులను కాజేసి పారిపోయినట్లు రికార్డయ్యింది. చోరీకి గురైన సొమ్ము రూ.5లక్షలకు పైనే ఉంటుందని వైన్స్ యజమాని ఎల్లయ్య తెలిపాడు. ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపారు.

ట్రాక్టర్ బ్యాటరీ అపహరణ

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం మహబూబ్‌పేట గ్రామంలో మంగళవారం ట్రాక్టర్ బ్యాటరీ చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌పేట గ్రామానికి చెందిన రైతు సోకం మల్లేష్ తన వ్యవసాయ బావి వద్ద సోమవారం రాత్రి తన ట్రాక్టర్‌ను ఉంచి ఇంటికి వెళ్లాడు. మంగళవారం వెళ్లి చూసేసరికి ట్రాక్టర్‌లోని బ్యాటరీ కనిపించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు బ్యాటరీ చోరీ చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు. బ్యాటరీ విలువ సుమారుగా రూ.12వేలు ఉంటుందని తెలిపాడు.

విద్యుదాఘాతంలో వ్యక్తి మృతి

నిడమనూరు: ఈదురుగాలులకు చెల్లాచెదురైన రేకుల షెడ్డుకు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి నిడమనూరు మండలం కక్కయ్యగూడెం గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కక్కయ్యగూడేనికి చెందిన కుంచం సైదయ్య(40) ఇటీవల 20 గొర్రె పిల్లలను కొనుగోలు చేశాడు. వాటి కోసం ఇంటి వద్ద తాత్కాలిక రేకుల షెడ్డు ఏర్పాటు చేశాడు. సోమవారం రాత్రి వచ్చిన ఈదురుగాలులకు షెడ్డు చెల్లాచెదురైంది. మంగళవారం ఉదయం సైదయ్య రేకుల షెడ్డుకు మరమ్మతులు చేస్తుండగా.. షెడ్డులో గొర్రెల కోసం ఏర్పాటు చేసిన ఫ్యాన్ వైరు రేకులకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బావిలో పడి బాలుడు మృతి


చరణ్ (ఫైల్)

వలిగొండ: సరదాగా ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన వలిగొండ మండలం ఎం. తుర్కపల్లిలో సోమవారం జరిగింది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎం. తుర్కపల్లికి చెందిన బట్టు సుధాకర్ చిన్న కుమారుడు బట్టు చరణ్(12) చెవిటి, మూగవాడు. సోమవారం మధ్యాహ్నం సుధాకర్ సోదరుడి కుమారుడు బట్టు గౌతంతో కలిసి చరణ్ ఎం. తుర్కపల్లి గ్రామానికే చెందిన తుమ్మల బాల్‌రెడ్డి వ్యవసాయ బావి వద్దకు ఈత కొట్టేందుకు వెళ్లారు. వీరికి ఈత రాకపోవడంతో బావి ఒడ్డున స్నానం చేస్తుండగా చరణ్ కాలుజారి బావిలో పడిపోయాడు. భయంతో ఇంటికి వెళ్లిన గౌతం ఇంట్లో ఎవరికీ ఈ విషయం చెప్పలేదు. సాయంత్రం వరకు చరణ్ ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. చరణ్ బావిలో పడిన విషయాన్ని గౌతం కుటుంబ సభ్యులకు చెప్పడంతో బావి వద్దకు వెళ్లి విద్యుత్ మోటార్లతో నీటిని తోడుతుండగా చరణ్ మృతదేహం లభించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం చరణ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

హుజూర్‌నగర్: అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు టిప్పర్లను రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. వివరాలు.. చిలుకూరు మండలం లక్ష్మీపురం గ్రామం నుంచి కొందరు అక్రమార్కులు టిప్పర్లలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు నాలుగు మట్టి టిప్పర్లను పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. మట్టి టిప్పర్లను పట్టుకున్న విషయాన్ని మైనింగ్ అధికారులకు తెలియజేశామని, వారు జరిమాన విధిస్తారని చెప్పారు. ఎవరైనా అధికారుల అనుమతి లేకుండా మట్టి, ఇసుకను అక్రమంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇంజనీర్స్ క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

నల్లగొండ: నల్లగొండలోని ఎస్‌ఎల్‌బీసీ మైదానంలో మంగళవారం ఇంజనీర్స్ క్రికెట్ లీగ్ జిల్లా అసోసియేషన్, హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా నీటిపారుదల శాఖ ఇంజనీర్స్ క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ ఆంజనేయులు, క్రాంతికుమార్, శివరాత్రి శ్రీను, ప్రభాకర్, నాగరాజు, సంతోష్‌రెడ్డి, మహేష్, చంద్రకాంత్ పాల్గొన్నారు.